క్లుప్తంగా

కరాటే పోటీల్లో బాలిక సత్తా



ఖిలా వరంగల్: వరంగల్ నగరం 17వ డివిజన్ గాడిపెల్లి గ్రామానికి చెందిన పసునూరి భాస్కర్, కర్ణ దంపతుల కుమార్తె వైష్ణవి.. రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో సత్తా చాటింది. పర్వతగిరి కస్తుర్బా ఆదర్శ పాఠశాలలో వైష్ణవి 9వ తరగతి చదువుతోంది. ఇటీవల వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–13 పోటీల్లో పాల్గొని వెండి పతకం సాధించింది. త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈమేరకు ఆమెను గాడిపెల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు మాటేటి రమేష్, పసునూరి భాస్కర్, యువరాజు, వంశీ, రమేష్‌తో కలిసి కార్పొరేటర్ గద్దె బాబు అభినందించారు.

దహన సంస్కారాలకు చేయూత



ఖిలా వరంగల్: వరంగల్ తూర్పుకోటకు చెందిన వడ్డె రాజు (45) అనారోగ్య సమస్యలతో ఆదివారం మృతి చెందారు. ఈమేరకు రాజు మృతదేహాన్ని బీజేపీ నాయకుడు నాంద్రే అమర్‌నాథ్‌తో కలిసి బీజేపీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ సందర్శించారు. మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. మృతుడి భార్య, ఇద్దరు పిల్లలను పరామర్శించి దహన సంస్కారాల నిమిత్తం రూ.10వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో స్థానిక నాయకులు బిల్ల కిషోర్, చింతం రమేష్, బొలుగొడ్డు నాగేందర్, బేర నరేందర్, ఏసీరెడ్డి రంజిత్, వినయ్ ఉన్నారు.

పేదల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా



మడికొండ: పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసాగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిలుస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. కాజీపేట మండలం మడికొండకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన కావ్యశ్రీ, కోమల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈమేరకు వారి చికిత్స నిమిత్తం కావ్యశ్రీకి రూ.2 లక్షల 50వేలు, కోమలకు రూ.లక్ష ఎల్‌ఓసీని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



ఎంజీఎం: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ పేర్కొన్నారు. వరంగల్ ఐఎంఏ హాల్‌లో ఎంజీఎం ఆస్పత్రి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి అసోసియేషన్ నాయకులు తీసుకెళ్లారు.

ఏసీపీ బోనాల కిషన్‌కు సన్మానం



హసన్‌పర్తి: వరంగల్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన బోనాల కిషన్‌ను పలివేల్పుల దుర్గా కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం దుర్గాకాలనీ కమిటీ అధ్యక్షుడిగా కిషన్ కొనసాగుతున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, కాలనీ కమిటీ సభ్యులు పోతరబోయిన లోకేషన్, వేణు, ఎం.ఎ.అలీ, రేవూరి సాంబరెడ్డి, శివారెడ్డి, శ్రీనివాస్, బండారి రమేష్, అంకూస్, వినయ్, కిషోర్ పాల్గొన్నారు.

శోభారాణి మృతిపై సంతాపం

కేయూ క్యాంపస్: మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ కందాల శోభారాణి మృతిపై మానవ హక్కుల వేదిక ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ ఎస్.జీవన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. శోభారాణి సామాజిక చింతన గల పోరురాలని, సమాజం పట్ల బాధ్యత కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు. కవయిత్రిగా, రచయిత్రిగా, అధ్యాపకురాలిగా ఆమె మంచి పేరు సంపాదించుకున్నారని తెలిపారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులకు మానవ హక్కుల వేదిక తరఫున ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆగుతూ.. సాగుతూ..

- నత్తనడకన కుమార్‌పల్లి మార్కెట్ రోడ్డు నిర్మాణ పనులు
- పదినెలల్లో 10శాతమే డ్రెయినేజీ నిర్మాణం పూర్తి
- అధికారులు, పాలకులు, కాంట్రాక్టర్ సమన్వయ లోపంతోనే జాప్యం
- బిల్లుల చెల్లింపులో ఆలస్యమవుతోందంటున్న కాంట్రాక్టర్
- అవస్థలు పడుతున్న వ్యాపారులు, ప్రజలు



సైడ్ డ్రెయినేజీ కోసం తవ్వి వదిలేసిన గుంతలు



అసంపూర్తిగా ఉన్న మురుగునీటి కాల్వ



గుంతలమయమైన కుమార్‌పల్లి మార్కెట్ రోడ్డు

హన్మకొండ చౌరస్తా: కూరగాయల, చికెన్, మటన్, చేపల మాంసం కొనుగోలుదారులతో నిత్యం రద్దీగా కనిపించే కుమార్‌పల్లి మార్కెట్ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పట్టణ ప్రగతి ద్వారా ఈ రోడ్డు అభివృద్ధికి అనేక ఏళ్ల తర్వాత మోక్షం కలిగింది. అయితే, టౌన్‌ప్లానింగ్ అధికారులు, స్థానిక కార్పొరేటర్, కాంట్రాక్టర్ల మధ్య సమన్వయ లోపంతో పనులు ఆగుతూ సాగుతున్నాయి. నిలిచిన పనులతో స్థానిక వ్యాపారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పది నెలలు గడుస్తున్నా..

సుమారు పది నెలల క్రితం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన పట్టణ ప్రగతిలో భాగంగా మార్కెట్‌ను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్య వినయ్‌భాస్కర్, నగర మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ ప్రావీణ్య సందర్శించారు. ఇరుకైన రోడ్డు, అస్తవ్యస్తమైన డ్రెయినేజీతో అవస్థలు పడుతున్నామని, తమ సమస్యలు పరిష్కరించాలని వారిని స్థానికులు కోరారు. అనంతరం, మార్కెట్‌రోడ్డుతో పాటు డ్రెయినేజీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్‌కు చీఫ్‌విప్ సూచించారు. కమిషనర్ ఆదేశాలతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కుమార్‌పల్లిలోని సాబీర్ హోటల్ నుంచి మినార్ చికెన్ సెంటర్ వరకు 210 మీటర్ల మేర సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీ నిర్మాణం కోసం రూ.40 లక్షల కార్పొరేషన్ నిధులు కేటాయించారు. టెండర్ ద్వారా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్.. ఇప్పటికీ పది నెలలు గడుస్తున్నా డ్రెయినేజీ నిర్మాణ పనులు 10శాతం కూడా పూర్తి చేయలేదని స్థానికులు చెబుతున్నారు.

సమన్వయ లోపంతో..

టౌన్‌ప్లానింగ్, కార్పొరేటర్, కాంట్రాక్టర్ల మధ్య సమన్వయ లోపంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం 35 నుంచి 40 ఫీట్ల రోడ్డును 60ఫీట్లుగా వెడల్పు చేస్తూ నిర్మాణం చేయాలి. అందుకనుగుణంగా మార్కింగ్ చేయడంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. స్థానికుల అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకుని వారి అభీష్టం మేరకు సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ ఇంకా 90శాతం మురుగునీటి కాల్వ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. నేటికీ సీసీ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. వేర్వేరు చోట్ల చేసిన పనులకు సంబంధించిన దాదాపు రూ.2 కోట్ల బిల్లులు కార్పొరేషన్ ఇప్పటి వరకు చెల్లించలేదని, అందుకే మార్కెట్ రోడ్డు, డ్రెయినేజీ పనుల్లో జాప్యం జరుగుతోందని సదరు కాంట్రాక్టర్ చెబుతున్నారు. అయితే, మార్కింగ్ పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

వ్యాపారం చేసుకోలేకపోతున్నాం..



డ్రెయినేజీ నిర్మాణం కోసం పనులు మొదలు పెట్టి దాదాపు నాలుగైదు నెలలు అవుతోంది. కొంతమేర మురుగు కాల్వ నిర్మించి వదిలేశారు. ఇదేంటని కార్పొరేటర్, అధికారులను అనేక సార్లు అడిగినా ప్రయోజనం లేదు. తవ్వి వదిలేసిన కాలువలోకి నీరు చేరి దుర్వాసన వస్తోంది. దీంతో వ్యాపారాలు చేసుకోలేకపోతున్నాం. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలి.

– నజీర్, చికెన్ సెంటర్, కుమార్‌పల్లి మార్కెట్

కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతోనే..



దాదాపు 30 సంవత్సరాలుగా పట్టించుకోని మార్కెట్ రోడ్డు, డ్రెయినేజీని ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించాం. స్థానిక వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి అభీష్టం మేరకే పనులు చేపట్టాలని అధికారులకు సూచించాం. గత బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి వస్తేనే పనులు ప్రారంభిస్తానని కాంట్రాక్టర్ చెబుతున్నారు. కమిషనర్ దృష్టి సారించి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలి.

– బైరి లక్ష్మికుమారి, కార్పొరేటర్, 8వ డివిజన్

మిల్లుకు చెందిన స్థలంలోనే నివేశన స్థలాలు ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న మిల్లు కార్మికులు

కాశిబుగ్గ: 318మంది అజంజాహి మిల్లు కార్మికులకు మిల్లు మైదానంలోనే నివేశన స్థలాలు కేటాయించాలని ఇంటి స్థలాల పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఏజే మిల్లు స్థలంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు మిల్లుకు చెందిన స్థలంలోనే నివేశన స్థలాలు కేటాయించాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తుచేశారు. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే నరేందర్, గ్రేటర్ కమిషనర్ ప్రావీణ్య చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

కరపత్రం ఆవిష్కరణ

కాజీపేట రూరల్: కాజీపేట కడిపికొండ ఆర్వోబీ కింద ఉన్న రైల్వే చిల్డ్రన్స్ పార్కు సమీపంలో త్వరలో ప్రారంభం కానున్న ఎమ్మార్పీఎస్ చైతన్య రాష్ట్ర సమితికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ చైతన్య రాష్ట్ర సమితి వ్యవస్థాపకుడు కె.జయరాజ్ మాట్లాడుతూ ప్రజల ఆశయ సాధనకు కృషి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పిల్లి కిష్టపర్, వక్కల కుమార్, ఎలుకపెల్లి అరుంధతి, దార వెంకట్, కాందారి సుభాష్, శేఖర్, ఎలకపల్లి మనోజ్‌కుమార్, రేణుక, కనకం పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వండి



పాదయాత్రలో నాయిని రాజేందర్‌రెడ్డి

నయీంనగర్: కాంగ్రెస్ పార్టీకి ఒకసారి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా 54వ డివిజన్‌లో హనుమాన్‌నగర్ రోడ్–2 వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను ఆదివారం నాయిని ఆవిష్కరించి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రాహుల్‌గాంధీ సందేశం కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ప్రతి కుల సంఘానికి కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హామీ ఇచ్చి ఒక్క కమ్యూనిటీ హాల్ కూడా నిర్మించలేదని విమర్శించారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే డివిజన్‌లో ఏం చేశారని ప్రశ్నించారు. 54వ డివిజన్‌ను తాను దత్తత తీసుకుంటున్నానని, రెండేళ్లలో అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, నాయకులు బంక సంపత్‌యాదవ్, చిన్నరాజు, గుంటి స్వప్న, బి.రవీందర్, అంకుస్, ఐలయ్య, రవీందర్, పల్లకొండ సతీష్, నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మడికొండ: కాజీపేట మండలం మడికొండ గ్రామంలోని శివకేశవ ఆలయంలో ఆదివారం ఉదయం చెన్నకేశవ స్వామి కల్యాణం నిర్వహించారు. అర్చకులు అనుముల నవీన్, వంశీకృష్ణ చార్యుల మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, శ్రీదేవి, భూదేవి, శ్రీలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో దాసరి రాజశేఖరం – నిర్మలాదేవి, తాటిరెడ్డి విద్యసాగర్‌రెడ్డి – విజయలక్ష్మి, బోనగిరి సరిత – నరసింహరావుల సహకారంతో కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురేష్, సుదర్శన్‌రెడ్డి, రవీందర్, భక్తులు పాల్గొన్నారు.

14నుంచి తాండ్ర కుమార్ వర్ధంతి కార్యక్రమాలు

వరంగల్ చౌరస్తా: ఎంసీపీఐ(యూ) రాష్ట్ర మాజీ కార్యదర్శి తాండ్ర కుమార్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాలను ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు పార్టీ నగర కార్యదర్శి గడ్డం నాగార్జున తెలిపారు. వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్‌లో తాండ్ర కుమార్ వర్ధంతికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈనెల 14న మియాపూర్‌లో తాండ్రకుమార్ స్మారక స్థూపం నుంచి ముజాఫర్ అహ్మద్‌నగర్ వరకు ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విగ్రహావిష్కరణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి జగదీశ్వర్, సభ్యులు మాలి ప్రభాకర్, నగేష్, నలువేల రవి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం



పాదయాత్ర నిర్వహిస్తున్న కొండా సురేఖ

రామన్నపేట: వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధిని బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా నగరంలోని 24వ డివిజన్ గోపాలస్వామి దేవస్థానం నుంచి గీతం స్కూల్, ఎస్ఎస్‌కే సేవ సమాజ్, పాపయ్యపేట చమాన్, వెంకటేశ్వరస్వామి దేవస్థానం, ఎల్లం బజార్, పతంజన్ కళాశాల మీదుగా ఆదివారం పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఇంటింటికి కొండా సురేఖ తిరుగుతూ ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ వద్దిరాజు గణేష్‌ను కలిసి కరపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నగరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైందని విమర్శించారు. ప్రజలకు మౌలిక వసతులను కల్పించడంలో సర్కారు విఫలమయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నల్గొండ రమేష్, దాసరి రాజేష్, మడిపల్లి కృష్ణ, కూరతోట సదానందం, ఎండి.సాజిద్, కుసుమ ఉమేష్, శ్వేత, బోయిన శ్రీలత, సుంకరవేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడామైదానాల వైపు పరుగెత్తాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న మహ్మద్ అజీజ్‌ఖాన్

వరంగల్ స్పోర్ట్స్: యువత వ్యసనాలకు బానిస కాకుండా క్రీడామైదానాల వైపు పరుగులెత్తాలని కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. రాజ్ ఎరోబిక్స్ ఆధ్వర్యంలో, వరంగల్ ఒలిపింక్ సంఘం, చక్రవర్తి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉదయం ఎన్ఐటీ నుంచి హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ వరకు 3కే లవ్ ఫిట్ రన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అభినవ్‌భాస్కర్ హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన యువత దేశానికి ఎనలేని సంపదని పేర్కొన్నారు. 3కే ఫిట్ రన్ నిర్వాహకుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ యువతలో ఫిట్‌నెస్‌పై అవగాహన, ఆవశ్యకత కోసమే రన్ నిర్వహించినట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి వరంగల్ ఒలింపిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ హాజరై ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు, రన్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సినీ నిర్మాత ఆడెపు శ్రీను, సృజన్ కాంత్, అంజనీదేవి, మాస్టర్ సతీష్, డాక్టర్ తరుణ్‌రెడ్డి, రాజ్‌కుమార్, సాజీద్, తిరుపతి, నందు, గంగాధర్, సునీత, నాగమణి, దళజిత్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'ప్రజాగోస – బీజేపీ భరోసా'



సమావేశంలో మురళీమనోహర్

వరంగల్: డివిజన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసమే 'ప్రజా గోస – బీజేపీ భరోసా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఓబీసీ కల్చరల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శ్రీరాముల మురళీమనోహర్ అన్నారు. శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్‌లలో భాగంగా ఆదివారం 20, 21వ డివిజన్లలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డివిజన్లలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని, వారం రోజులుగా తాగునీరు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ అపురూప రజనీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, కుసుమ సతీష్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, పరమేశ్వర్, వెంకటరమణ, భవానిశంకర్, వంగరి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



న్యూశాయంపేట: మాట్లాడుతున్న ప్రదీప్‌రావు

చింతల్‌లో..

న్యూశాయంపేట: భారతీయ జనతా పార్టీ పిలుపు ప్రజాగోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం చింతల్‌లోని 148, 149, 150 శక్తి కేంద్రాలలో ఆదివారం సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే నరేందర్ పూర్తిగా విఫలం చెందారని నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్ ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజారంజక పాలన అందచేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆడెపు వెంకటేష్, వన్నాల వెంకటరమణ, త్రిలోకేశ్వర్, అరుణ్, మధుకుమార్, శ్రీధర్, శేఖర్, రాజ్‌కుమార్, సమ్మయ్య పాల్గొన్నారు.

ఇరు జిల్లాల ఆర్టీఏ కమిటీ సభ్యుల ఎన్నిక



మంత్రి, చీఫ్‌విప్‌ను కలిసిన రాజు

కాజీపేట / హన్మకొండ: ఆర్‌టీఏ హనుమకొండ, వరంగల్ జిల్లాల కమిటీ సభ్యులను నియమించారు. హనుమకొండ రవాణాశాఖ కార్యాలయ కమిటీ సభ్యుడిగా రాజును కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరోమారు ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఉత్తర్వులను రాజుకు చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం అందజేశారు. కాజీపేట పట్టణం సోమిడి గ్రామానికి చెందిన రాజును మూడోసారి ఆర్టీఏ కమిటీ సభ్యుడిగా కొనసాగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

వరంగల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడిగా మనోహర్

వరంగల్: వరంగల్ రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడిగా కాశిబుగ్గకు చెందిన గోరంటల మనోహర్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు కాశిబుగ్గకు చెందిన మనోహర్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆశీస్సులతో ఈ అవకాశం లభించిందని తెలిపారు.



గోరంటల మనోహర్

పనులు నాణ్యతగా చేయాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయశ్రీ

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి వెస్లీ పాఠశాల ఎదుట రూ.13 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ ఆదివారం పరిశీలించారు. ఈమేరకు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఫార్మేషన్ పనులను పర్యవేక్షించి నాణ్యతగా పనులు త్వరితగతిన చేపట్టాలని ఆమె సూచించారు.

సంక్షిప్తంగా

రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు



కవాతు నిర్వహిస్తున్న రాపిడ్ యాక్షన్ ఫోర్స్

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీసుల ఆధ్వర్యంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆదివారం సాయంత్రం కవాతు నిర్వహించింది. కిట్స్ క్రాస్ నుంచి ప్రారంభమైన కవాతు.. హనుమకొండ పెట్రోల్ పంప్ వరకు సాగింది. కార్యక్రమంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కమాండెంట్ జితేంద్ర నందవార్, హనుమకొండ ఇన్‌చార్జ్ ఏసీపీ కృష్ణ, కేయూసీ ఇన్‌స్పెక్టర్ దయాకర్, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

17న హిందూ ముక్తిస్థల్‌లో శివపార్వతుల కల్యాణం



కరపత్రాలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

వరంగల్: వరంగల్ ఎల్‌బీనగర్‌లోని హిందూ ముక్తిస్థల్‌లో శివపార్వతుల (వటవృక్ష) కల్యాణాన్ని ఈనెల 17వ తేది ఉదయం 10.41 గంటలకు నిర్వహించనున్నట్లు ముక్తిస్థల్ కమిటీ తెలిపారు. ఈమేరకు ముక్తిస్థల్ వద్ద కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు బూర రాంచందర్, గోరంటల రాజు, నర్సింగరావు, వంగర భాస్కర్, సుధాకర్, అకెన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బండా ప్రకాశ్‌కు శుభాకాంక్షలు

మడికొండ: మండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైన బండా ప్రకాశ్‌ను మడికొండ ముదిరాజ్ సంఘం సభ్యులు హైదరాబాద్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మడికొండ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దువ్వ నవీన్, రాష్ట్ర, జిల్లా నాయకులు పల్లెబోయిన అశోక్, బయ్య స్వామి, పులి రజినీకాంత్, చొప్పరి సోమన్న, పోలు అమర్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ భార్య మృతి

దేశాయిపేట: గ్రేటర్ వరంగల్ పైడిపల్లిలోని మాజీ కార్పొరేటర్ వీర భిక్షపతి భార్య వీర పరిమళ శనివారం మృతి చెందారు. కాగా, ఆదివారం ఉదయం పరిమళ అంత్యక్రియల్లో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ ఎల్లావుల లలితాయాదవ్, 3వ డివిజన్ కార్పొరేటర్ షీబారాణి, బీఆర్ఎస్ నాయకులు జన్ను అనిల్, కేతిరి రాజశేఖర్, విజయ్ పాల్గొన్నారు.

ప్రజల మనోభావాలకు ప్రాధాన్యం

ధర్మసాగర్: ప్రజల మనోభావాలకు ప్రాధాన్యం ఇస్తానని మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి తెలిపారు. మండలంలోని తాటికాయల గ్రామంలో పరిశుద్ధ ఫాతిమా మాత చర్చి నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హన్మకొండ: ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థులు

హన్మకొండ: హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 1976 – 1979లో బీకాం చదివిన పూర్వ విద్యార్థులు హనుమకొండ సుబేదారిలోని వరంగల్ క్లబ్ వేదికగా ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అలాగే, నాటి గురువులు కూరపాటి వెంకటనారాయణ, సుదర్శన్, నర్సింహమూర్తి, కృష్ణమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాశీప్రసాద్, డీఎల్ఎన్.చారి, వెంకటేశ్వర్లు, రాజేంద్రకుమార్, రాజన్‌బాబు, నీలం సంపత్, కమలాదేవి పాల్గొన్నారు.

వాణినికేతన్ హైస్కూల్‌లో..

న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని ప్రభుత్వ ఆమోదిత వాణినికేతన్ హైస్కూల్‌లో 1996 – 97లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం వరంగల్ చింతల్ ప్రాంతంలోని ఓ ఫంక్షన్‌హాల్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకచోటుకు చేరుకుని నాటి జ్ఞాపకాలను స్మరించుకుంటూ, నాటి గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుల్లపెల్లి రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు ప్రకాశ్, విమలాదేవి, శాంతాదేవి, వెంకటేష్, తాజొద్దీన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న వాణినికేతన్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు